క్లుప్తంగా

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం



తెనాలిఅర్బన్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వడం హర్షణీయమని కంచర్ల పాలెం ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆదివారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: చదలవాడ సతీష్ చంద్ర 3వ వర్ధంతిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో కూడా అన్నదానం చేశారు. కార్యక్రమంలో చదలవాడ వేణుగోపాలరావు, నయనతార, శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, ఉమామహేశ్వరరావు, దామోదర్, ప్రణవ్, ఆద్విక్, పాల్గొన్నారు.

ఫిలదెల్ఫియా సంఘ సభ్యులకు సన్మానం



తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు జన్మించిన ఇజ్రాయేల్ దేశాన్ని సందర్శించడం అదృష్టమని ఫిలదెల్ఫియా సంఘ కాపరి పాస్టర్ చిలువూరి నతానియేల్ పేర్కొన్నారు. మారీసుపేటలోని చర్చి ఆవరణలో ఇజ్రాయేల్ పర్యటన పూర్తి చేసుకుని స్వస్థలానికి వచ్చిన సంఘ సభ్యులు పినపాటి స్టీవెన్‌బాబు, గాజులవర్తి కెథారిన్, బుల్లా మాణిక్యమ్మ, కొండమూడి వరప్రసాద్, సుజాత దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇజ్రాయేల్ దేశ పర్యటన విశేషాలను వారు వివరించారు.

రేపు చుండూరు మృతవీరుల సంస్మరణ సభ



తెనాలిఅర్బన్: చుండూరు మృతవీరుల సంస్మరణ సభ ఈ నెల 6వ తేదీ నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం 'చలో చుండూరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. చుండూరులో నిర్వహించనున్న సభకు అంబేడ్కర్‌వాదులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు వై.అనిల్, ఉన్నవ సల్మాన్, నల్లగండ్ల రవిచంద్ర, కనపర్తి శశి, దండమూడి సతీష్, యంగ్రపాటి సునీల్, జూపల్లి వంశీ, కుర్రా యశ్వంత్, దుబాయ్ బాబు, సయ్యద్ గౌస్, పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల భక్తి గాన నీరాజనం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నవకళోదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల భక్తిగాన నీరాజనం నిర్వహించారు. పీఎల్ఎన్ మూర్తి నిర్వహణలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, నవ కళోదయ సభ్యుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు టి.సుధీర్, ఆర్.పి.ఎల్.నరసింహారావు, అన్నపూర్ణ, నారాయణ, మోహన్, అశోక్, వెంకాయమ్మ పాల్గొన్నారు. తిరు వెంకటాధీశ జగదీశా, ఎంతెంత దయనీది ఓ సాయి, ఏడుకొండల స్వామి ఎక్కడున్నావయ్యా, పిలిచిన పలుకవే ఓ స్వామి వంటి భక్తి గీతాలు హృద్యంగా ఆలపించారు.

చదువులపై నిర్లక్ష్యపు నీడ

- తగ్గిన విద్యార్థుల సంఖ్య
- 112 మంది ఉపాధ్యాయుల కొరత
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నిధులు పెండింగ్

తెనాలి: పేదల చదువులపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ ఏడాది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు విప్లవాత్మకం అనిపించుకున్నాయి. పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో సకల సదుపాయాలతో తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ శ్రద్ధ కొరవడింది. ఉపాధ్యాయుల కొరత, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు బిల్లులతో సహా పలు సమస్యలు తిష్ఠ వేసుకున్నాయి.



కొల్లిపర మండలం దంతలూరులో శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)





మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ) శిథిలావస్థకు చేరిన దృశ్యం

మొత్తం పాఠశాలలు..

పట్టణ మున్సిపాలిటీ, రూరల్ మండలం, కొల్లిపర మండలం పరిధిగా గల తెనాలి నియోజకవర్గంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 135 ఉండగా, వీటిలో ప్రాథమిక పాఠశాలలు 114 కాగా, ఒకే ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 20 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 740 మంది ఉపాధ్యాయులకు గాను ప్రస్తుతం 628 మంది పనిచేస్తున్నారు. 112 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కొందరు టీచర్లను బదిలీ చేసినప్పటికీ, వారి బదిలీలను నిలిపివేయటంతో పాఠశాలల్లో ఖాళీలు అలాగే ఉండిపోయాయి. 2024–25 విద్యా సంవత్సరానికి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది.

ఏజెన్సీలకు బకాయిలు..

ఇక మధ్యాహ్న భోజనం పథకంలో తెనాలి నియోజకవర్గంలో అక్షయపాత్ర ఏజెన్సీ సహా మొత్తం 141 ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. జెడ్పీ హైస్కూళ్లలో 9, 10 తరగతులకు కుకింగ్ బిల్లులు రావాల్సి ఉంది. తెనాలి పట్టణం, మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గడచిన జూన్ నెల బిల్లులు అందాల్సి ఉంది. కొల్లిపర మండలంలో 2,170 మంది విద్యార్థులకుగాను అంతా మధ్యాహ్న భోజనం చేస్తున్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తెనాలి పట్టణం, మండలంలో 10,050 మంది విద్యార్థులు ఉండగా 9,436 మంది భోజనం చేస్తున్నారు. అంటే 614 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయటంలేదు. కొల్లిపర మండలంలో ఆయా, నైట్‌వాచ్‌మెన్‌కు ఏప్రిల్, మే, జూన్ నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

తగ్గిన విద్యార్థుల సంఖ్య..

గతేడాది ప్రాథమిక పాఠశాలల్లో 2,344 విద్యార్థులకుగాను ఈ ఏడాది 2,170 మంది ఉన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 11,648 మందికిగాను, 10,050 మంది ఉన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 1,772 మంది విద్యార్థులు తగ్గారు.

శిథిలావస్థలో కొన్ని పాఠశాలలు..

కొల్లిపర మండలంలో రెండు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. మున్నంగిలోని ఎంపీపీఎస్(యు) పాఠశాల, కొల్లిపరలోని ఎంపీపీఎస్ (ఎల్ఈ) పాఠశాలలు శిథిలావస్థలో నడుస్తున్నాయి. దంతలూరులోని ఎంపీపీఎస్(ఆర్), గొడపాలెంలోని ఎంపీపీఎస్ పాఠశాలలకు మరమ్మతులు అవసరం ఉంది. అసంపూర్తిగా ఉండిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారో తెలియటం లేదు.

ఆ ఫుట్‌పాత్ ప్రదేశం ఇక ఖాళీ

- ఎంతోకాలంగా అక్కడే ఉంటున్న వ్యక్తి
- మండే ఎండ.. జోరు వర్షం ఏదైనా సరే!
- అనారోగ్యంతో మృతి
- స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



ఓవర్‌బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై వ్యక్తి

తెనాలి: గాలితో.. నీటితో.. ఆహారంతో.. ఇక నాకేమి అవసరంలేనట్టు అతడు.. ఎక్కడివాడో తెలీదు... చెంచుపేట నుంచి వచ్చేటప్పుడు రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆరంభంలో ఎడమవైపు రెయిలింగ్‌కు ఆనుకుని ఫుట్‌పాత్‌పైనే నివాసం. కింద ఓ బొంత, రెయిలింగ్ పైనుంచి కొన్ని దుప్పట్లు తనపై కప్పుకుని ఉంటాడు. భారీ వర్షంలో, 45 డిగ్రీల ఎండ వేడిమిలోనూ అక్కడే పడకసీనులో ఓవర్‌బ్రిడ్జి ఎక్కి దిగే ప్రతివారికీ కనిపిస్తాడు. ఎవరైనా ఆహారం పెడితే లేచి కూర్చుని తీసుకుంటాడు. ఆకలి తీరుతుంది...మళ్లీ యథాస్థితిలోకి వెళతాడు. ఏమైందో ఏమో తెలీదు...

ఆదివారం ఉదయం విగతజీవుడై కనిపించాడు. విషయం తెలిసిన స్థానిక హెల్పింగ్ సోల్జర్స్ సంస్థ ప్రతినిధి షేక్ ఇనయతుల్లా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం వద్ద దుస్తుల్లో ఆధార్ కార్డు లభించింది. అందులోని వివరాల ప్రకారం కొత్తపల్లి జగన్‌మోహనరావు, తురిమెళ్ల అని ఉంది. అంతకుమించి వివరాలేవీ లేవు. అనాథ కావటంతో హెల్పింగ్ సోల్జర్స్ సంస్థ ఆధ్వర్యంలో అతడి మృతదేహాన్ని బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. అక్కడే అంత్యక్రియలను పూర్తిచేశారు. ఇనయ్‌తుల్లా, ఆయన మిత్ర బృందం రవి, సంజయ్, వేణును స్థానికులు అభినందించారు.

హడలెత్తించిన వీధి కుక్క

- ఆరేపల్లిలో ఐదుగురికి కుక్క కాట్లు
- 85 ఏళ్ల వృద్ధుడి కండలు పీకిన వైనం



తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేతికి కట్టుతో బి.సుబ్బారావు

తెనాలి: ఇంటి చావడిలో మంచంపై నిద్రపోతున్న ఓ వృద్ధుడిని ఓ వీధి కుక్క దారుణంగా కరిచింది. తలకింద చెయ్యి పెట్టుకుని నిద్రిస్తుండగా వీధికుక్క దాడిచేసింది. మోచేతి కండ పీకేసింది.

స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేశారు. వివరాలు.. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలోని ఆరేపల్లి యాదవపాలెంలో బి.సుబ్బారావు అనే 85 ఏళ్ల వృద్ధుడు ఆదివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో భోజనం చేశాడు.

అలవాటు ప్రకారం ఇంటిని ఆనుకుని ఉండే చావడిలోకి వెళ్లి మంచంపై నిద్రకు ఉపక్రమించాడు. కొద్దినిముషాల్లోనే అటువైపు వచ్చిన ఓ వీధికుక్క సుబ్బారావు తలకింద పెట్టుకున్న ఎడమచేతిని నోటికి తీసుకుంది. కసితీరా కండ ఊడేలా కరిచేసింది. ఉలిక్కిపడి లేచిన సుబ్బారావు అరుపులకు బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు, కుక్కను తరిమేశారు. అప్పటికే అతడి చేతినుంచి కండ ఊడిపోయి, రక్తమోడుతోంది. దీనితో అతడిని హుటాహుటిన తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి, అనంతరం కుట్లు వేశారు. ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు. ఆరేపల్లిలో ఆ వీధికుక్క ఆగడం అంతటితో ఆగలేదు. మరో నలుగురిని కరిచిందట! వారిలో ఇద్దరు ఇదే ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకున్నారు. ఆగ్రహం చెందిన గ్రామస్తులు ఆ కుక్కను వెంటాడి చంపినట్టు తెలిసింది.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ



పుస్తకాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు, దాతలు

తెనాలి: పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయానికి ట్రస్ట్ బాధ్యులు వేజళ్ల నవ్య పుస్తకాలను బహూకరించారు. ఈసందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ, విద్యా ట్రస్టు ద్వారా ఏటా విలువైన పుస్తకాలను పాఠశాలల గ్రంథాలయాలకు, ప్రభుత్వ గ్రంథాలయాలకు బహూకరిస్తున్నామని చెప్పారు. సెల్‌ఫోన్ యుగంలో యువతరానికి పుస్తక పఠనం అలవరచేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పుస్తక పఠనంతో భావవ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రంథాలయాలకు అత్యధిక ప్రాముఖ్యత ఉంటుందని వివరించారు. నేటితరం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి శ్రీమతి కోడూరి అంజని దాతలు సమకూర్చిన పుస్తకాలు పిల్లలకు బాగా ఉపకరిస్తాయని చెబుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు. తమ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం పిల్లలకు 'రూమ్ టి రీడ్' నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: ఘర్షణ పడవద్దని చెప్పిన వ్యక్తిపైనే రాయితో దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ ఇస్లాంపేటకు చెందిన తిరుపతిరావు ఆదివారం తెల్లవారుజామున తన వద్ద పని చేసే షేక్ బూరాతో కలసి మార్కెట్ యార్డుకి వెళుతున్నాడు. అక్కడ అతనికి తెలిసిన యశ్వంత్ మరొకరితో ఘర్షణ పడుతున్నాడు. తిరుపతిరావు వెళ్లి సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా యశ్వంత్ రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం



సంగీత సంఖ్యాయని

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం చేసింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగ పరిశోధకురాలు ఎ. సంగీత సంఖ్యాయనికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఆమె ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ పి. బ్రహ్మాజీరావు పర్యవేక్షణ లో ' క్యారక్టరైజేషన్ ఆఫ్ నానో కాపర్ ఆక్సైడ్ పార్టికల్స్ ఎక్స్‌ట్రాక్ట్ ఫ్రమ్ ఈ వేస్ట్ అండ్ ఎఫిషియన్సీ అండ్ వాటర్ క్వాలిటీ క్రైటీరియా' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.



రత్నం

డాక్టర్ అంబేడ్కర్ అధ్యయనకేంద్ర పరిశోధకుడు కె. రత్నానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధా కర్ తెలిపారు. ఆయన అంబేడ్కర్ అధ్య యన కేంద్రానికి చెందిన కె. సోమశేఖర్ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఆన్ లివింగ్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్ ఏ కేస్ స్టడీ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు తెలిపారు.

అవయవ దానం మహత్తర ఆశయం



సమావేశంలో మాట్లాడుతున్న యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్

లక్ష్మీపురం: అవయవ దానం మహత్తర ఆశయమని హెల్త్ ఎవేర్ నెస్ అధ్యక్షుడు, ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం అవయవదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుశేఖర్ మాట్లాడుతూ అవయవ దానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేసి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. చనిపోయిన తర్వాత కూడా మరికొంతమందిలో కొన్నేళ్లపాటు బతికే ఉంటారని చెప్పారు.

అవయవదాన ప్రచారకులు పి.భావన్నారాయణ, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అవయవదానంపై చైతన్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక స్థాయిలోనూ అవయవ దానం ప్రాధాన్యం, అవసరాన్ని గురించి పిల్లలకు తెలిసేలా పాఠ్యాంశాల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, ఇంజినీర్ సదాశివం, సంస్థ సీనియర్ సభ్యుడు పి.జనార్దనరావు ప్రసంగించారు.

జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా వాక్‌థాన్



గుంటూరు మెడికల్: జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిసా కూడలి వరకు వాకథాన్ నిర్వహించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. శరీరంలో రక్త నాళాల ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యం కోసం అందరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ శరీరంలో రక్త ప్రసరణ అనేది చాలా ముఖ్యమైందని తెలిపారు. అవయవాలలో ఎక్కడైనా నల్లటి మచ్చలు కనబడితే రక్తప్రసరణలో తేడాలు ఉన్నట్లు గుర్తించి తక్షణమే వాస్క్యులర్ వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. గుంటూరు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు వాస్క్యులర్ సర్జరీ ప్రాముఖ్యతను వివరించారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ తరపున హాజరైన డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఒంటి మీద ఏదైనా నల్లటి మచ్చలు కనబడితే కచ్చితంగా తమను సంప్రదించాలని తెలిపారు. ఈ మధ్యకాలంలో మధుమేహ బాధితులకు వేళ్లు, కాళ్లను తీసి వేస్తున్నారని, రక్తనాళాల్లో ఇబ్బందుల వల్ల, రక్త ప్రసరణ సరిగ్గా లేకపోవడం వల్ల ఇలా జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ రెడ్డి, సురేంద్ర నాగులపాటి, స్వప్న కందిమళ్ల, మొహమ్మద్ షఫీఉల్లా, నగరంలోని వివిధ కళాశాల, వైద్యశాలల వైద్యులు , విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎస్ నగర్‌కు చెందిన వెంకటేష్(35) ఆరు నెలల కిందట ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రాజు

తెనాలి: ఖాతాదారులకు చక్కని సేవలను అందిస్తూ సొసైటీ బ్రాంచి అభివృద్ధిలో సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు అన్నారు. సొసైటీ, తెనాలి సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన చైర్మన్ రాజు మాట్లాడుతూ సొసైటీ కార్యకలాపాలను వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశంలోని అగ్రగామి 10 సొసైటీల్లో తమ సొసైటీ ముందు వరసలో ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.77 కోట్ల లాభాలను ఆర్జించినట్లు తెలిపారు. డిపాజిట్లపై 10 శాతం, సేవింగ్స్‌పై 6.5 శాతం వడ్డీని చెల్లిస్తున్నామని వివరించారు. సొసైటీ వార్షిక ప్రణాళిక, విధివిధానాలు, ఆర్థికలావాదేవీలు, లాభనష్టాలు, వృద్ధిరేటు గణాంకాలను సభ్యులకు వివరించారు. సొసైటీ 27వ సంవత్సరం పూర్తి చేసుకుని, 42 శాఖలతో నడుస్తోందని చెప్పారు. తొలుత సొసైటీ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి హనుమంతరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సొసైటీ ఆర్ఎం డీవీఎస్ శంకరరావు, మేనేజర్ పి.శ్రీకాం, సిబ్బంది గణేష్, సాయి తరుణ్, బాషా, సుధాకర్ పాల్గొన్నారు.

ఫ్యూజ్ వేసేవారు లేరంట!

- కరెంటుకు అంతరాయం
- కోతతో వినియోగదారుల ఇక్కట్లు

తెనాలి: ఫ్యూజ్ పోతే విద్యుత్ సబ్‌స్టేషనులో ఫ్యూజ్ వేసేవారు లేరట! ట్రాన్స్‌కో అధికారులు వినియోగదారులకు చెప్పిన సమాధానమిది! అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాత్రివేళ నిద్రకు నోచుకోని పరిస్థితి నెలకొంది. పట్టణ నాజరుపేటలో ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కరెంటు సరఫరాకు అంతరాయం నెలకొంది. గంటసేపైనా కరెంటు రాలేదు. నిద్రకు ఉపక్రమించే సమయంలో కరెంటు పోవటంతో జనానికి దిక్కుతోచలేదు. పగలంతా వేసవిని తలపించిన ఎండతో అలసిన జనాలకు పనులు ముగించుకుని ఇంటికి చేరేసరికి కరెంటు లేకపోవటంతో దిక్కుతోచని పనైంది. ఎదురుచూస్తూనే కరెంటు ఆఫీసుకు ఫోన్‌చేస్తే సమాధానం చెప్పేవారు కరవయ్యారు. నాజరుపేట, బీసీ కాలనీతోపాటు బుర్రిపాలెంలోనూ కరెంటు సరఫరా లేదు. బుర్రిపాలెం సబ్‌స్టేషనులో అంతరాయంతో ఈ సమస్య నెలకొంది. తీరా విచారిస్తే సబ్‌స్టేషనులో ఫ్యూజ్ వేసేవారు లేకపోవటంతో ఏం చేయలేకపోతున్నట్టు సిబ్బంది సమాధానమిచ్చారు. ఎవరో ఒకరు తెనాలి నుంచి వెళ్లి ఫ్యూజ్ వేయాలట! ఎప్పుడు వెళతారు? ఎప్పుడు ఫ్యూజ్ వేస్తారో? అన్న ప్రశ్నకు సమాధానం లేదు. రాత్రి 10.40 గంట లక్కూడా కరెంటు రాని పరిస్థితి.

ఉద్యోగం పేరిట మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: యువకుడిని ఇద్దరు మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పాత గుంటూరుకు చెందిన సువర్ణకుమారి కుమారుడు బ్రాడీపేటలోని ఓ సెల్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కొత్తపేటకు చెందిన సందీప్, ఖాజాలు అతడితో పరిచయం చేసుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఆ యువకుడు మెడలోని బంగారు గొలుసును ఇద్దరికీ ఇచ్చాడు. అనంతరం కొద్దిరోజుల తరువాత సందీప్, ఖాజాలు బెదిరించి కొన్ని పత్రాల మీద సంతకాలు చేయించి ఈఎంఐ కింద ఏసీ కొనుగోలు చేశారు. ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో కుమారుడి తరఫున సువర్ణకుమారి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..



ముత్తెంశెట్టిపాలెం వెళ్లే రోడ్డుపై వ్యర్థాల గుట్టలు ఆదివారం దర్శనమిచ్చాయి. ఆ ప్రాంతంలోని ఇళ్ల నుంచి చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తీసుకువచ్చి రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. సమీపంలో డస్ట్‌బిన్‌లు ఉన్న రోడ్డుపైనే వేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –తెనాలిఅర్బన్

ఆదమరిస్తే అంతే



సోమసుందరపాలెం నుంచి తెనాలి వచ్చే మార్గంలో రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో కఠెవరం వంతెన వద్ద సరిగ్గా రోడ్డు మధ్యలో గొయ్యి పడింది. ఆదమరిస్తే రోడ్డు, తూర్పు కాల్వ రిటైనింగ్ వాల్ మధ్యలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఏళ్ల తరబడి ఈ రోడ్డు నిర్మాణం ఎలాగూ జరగడం లేదు.. కనీసం ఇటువంటి గోతులనైనా పూడ్చించాలని ప్రయాణికులు కోరుతున్నారు. –తెనాలిరూరల్